# టింకూ ఇన్ టెక్సాస్

'టింకూ!బట్టలు సర్దుకున్నావా?'మాస్టర్ బెడ్‌రూమ్ లోంచి సుస్మిత గట్టిగా ఓ కేక లాంటిది వేసింది.
ఏ గదిలో నుంచి సమాధానం రాలేదు.
'టింకూ ,వినిపిస్తోందా?ఆర్ యూ గెటింగ్ రెడీ?'అంది మరోసారి.
ఊహు.ఎక్కడా అలికిడి లేదు.
'అడిగితే సమాధానం చెప్పవేమిటి?ఎన్నిసార్లు చెప్పాను, పిలవగానే పలకమని' అంది సుస్మిత కంఠస్వరంలో అసహనం ప్రతిధ్వనిస్తుండగా.

ఇక మాటలతో లాభం లేదని తమ గదిలో సర్దుతున్న బట్టల పని సగంలో వదిలేసి లేచి బెడ్‌రూమ్‌కి అనుకుని వున్న టింకూ గది
లోకి వెళ్లింది.అక్కడ టింకూ లేడు.మెట్లు దిగి హాల్లో చూసింది. ఊహు, అక్కడా లేడు.స్టడీరూమ్‌లో కంప్యూటర్ దగ్గర వున్నాడేమో చూద్దామని అక్కడకు వెళ్లింది.
అక్కడున్నాడు టింకూ.
మానిటర్ మీద వీడియోగేమ్ ఆడుతూ అతి దీక్షగా,మరోప్రపంచంలోకి వెళ్లి
పోయి.ఒక చేత్తో మౌస్‌ను తిప్పుతూ మరో చేత్తో హేరీని ఒళ్లో జాగ్రత్తగా కూర్చోబెట్టుకున్నాడు.
'టింకూ.పిలుస్తుంటే వినిపించడం లేదా?ఎన్ని సార్లు చెప్పాను?పిలవగానే ఆఁఅనమని'
ఆఁఅన్నాడు అలవోకగా టింకూ.
'ఇప్పుడు కాదు.నేనుపిలవగానే.సరేసరే.షట్‌డౌన్ ది కంప్యూటర్.పైకి
వచ్చి నీ బట్టలు సర్దుకో'అంది సుస్మిత.
'ఫర్ వాట్?'ఎట్టకేలకు తలెత్తకుండానే ఓ ప్రశ్న వేశాడు ఆరేళ్ల టింకూ.
'ఫర్ వాటా?సమ్మర్ వెకేషన్ ట్రిప్ మర్చిపోయావా?ఇండియా వెళ్తున్నామని చెప్పాను
కదా.లే.లే.లేచి పైకిరా.నేను కాస్త
హెల్ప్ చేస్తాను.ఇద్దరం కలిసి బట్టలు సర్దేద్దాం.ఇక ఎక్కువ టైం లేదు.నేను సర్దితే నువ్వు మళ్లీ అక్కడ పోకేమాన్ షర్ట్ తేలేదా?స్పైడర్ మాన్ జీన్స్ ఎక్కడా అని నన్ను విసిగిస్తావు.పదపదా'అంటూ తొందరపెట్టింది.

'మమ్మీ!ఐ టోల్డ్ యూ,ఐయామ్ నాట్ కమింగ్.నేను డాడ్‌తో పాటు ఇక్కడే వుంటాను' స్పష్టంగా తన నిర్ణ
యం ప్రకటించేశాడు.
'నో.నో.అదెట్లా కుదురుతుంది?మూడు నెలలు మీ నాన్న నిన్ను చూసుకో
వడం అయ్యే పని కాదు కానీ,నువ్వూ నాతోబయల్దేరు.నేను మనిద్ద
రికి టిక్కెట్లు బుక్ చేశాను.అవర్ ట్రిప్ ఈజ్ కన్‌ఫర్మ్‌డ్.నో మోర్ ఆర్గుమెంట్స్'అంటున్న సుస్మి
తకు తన మాటలతో మళ్లీ అడ్డుపుల్ల వేశాడు టింకూ.
'నేను చెపుతుంటే వినవేమిటి?ఇట్స్ నాట్ ఫెయిర్ ఫర్ యూ.'
'ఎవరికి ఫెయిర్ కాదు?నేను నీకు ఆరునెలలుగా చెప్తున్నా.ఈ సారి సమ్మర్ కి ఇండియా వెళతామని'.
ఓకే.ఓకే.నేను డాడ్‌తో మాట్లాడతాను. ప్లీజ్ మామ్.గివ్ మీ టెన్ మినిట్స్.ఈ గేమ్ ఫినిష్ చేసి వచ్చేస్తాను.'
★★★
ఆనంద్ రాగానే టింకూ ఇండియాకు రానంటున్న విషయం చెప్పింది సుస్మిత.
ఆనంద్ టింకూను పిల్చాడు మాట్లాడటానికి.
'ఏం నాన్నా టింకూ!అమ్మతో ఇండియా వెళ్లనన్నావటకదా?ఏమిటి నీ ప్రాబ్లమ్?'ఒళ్లో కూర్చుబెట్టు
కుని అనునయంగా అడిగాడు ఆనంద్.
'ఇండియా అంటే బోర్ అండ్ డర్టీ డాడ్.నేనెళ్లను.ఇక్కడే వుంటాను. నా సమ్మర్ యాక్టివి
టీస్ అన్నీ మిస్ అవుతాను ఇండియావె
ళితే.ప్లీజ్ డాడ్!ఇక్కడే నీతో వుంటాను.ప్లీజ్ ప్లీజ్'అంటూ గారాలు పోతూ ఆనంద్ గడ్డంపుచ్చుకుని బతిమి
లాడాడు టింకూ.
'దొంగ దొంగ!నాకు నీ సంగతి తెలుసు కానీ.నీ ప్రాబ్లమ్ సమ్మర్ క్లాసెస్ కాదులే ,అసలు సంగతి ఏంటో చె
ప్పేయి' అన్నాడు ఆనంద్.
'డాడ్.మై రియల్ ప్రాబ్లమ్ ఈజ్ హేరీ.హేరీకి ఫ్లైయిట్ జర్నీ అంటే భయం.ఇంతవరకూ ఎప్పుడూ ఎక్క
డకు వెళ్లలేదు కదా,భయపడుతున్నాడు. హేరీకి కొత్త ప్లేసెస్ అన్నా,కొత్తవా
ళ్లన్నా చాలా భయం.నీకు చాలాసార్లు చెప్పాను కదా.సో,ప్లీజ్‌ప్లీజ్ డాడ్.ఈసారి సెలవులకు
మనం ఇక్కడే వుందాం.నేనేం నిన్ను ఇబ్బంది పెట్టను.నా పనులు నేనే చేసుకుంటాను.ఒప్పుకో
డాడ్.ప్లీజ్ మమ్మీని వెళ్లివచ్చేయమనవా?'
'టింకూ.లిజన్ టు మీ.హేరీ కేవలం నీ ఆటబొమ్మ.అచ్చం పిల్లాడిలా వున్న ఓ బొమ్మ.దానికి నీకిష్ట
మైన పేరు పెట్టుకున్నావు.అంతేకానీ అది నీతోమాట్లాడదు.ఆడుకోదు.నువ్వే దానితో ఆడుకుం
టావు.అది నీ ఫ్రెండ్‌లా నువ్వు ఊహించుకుంటున్నావు.ఇట్సొకే ఇన్ యువర్ గేమ్స్.అంతే
కానీ అదేదో అచ్చం నీలాంటి పిల్లాడిలాగా నువ్వు దానితోనే ఆడుకోవడం,మాట్లాడటం,నీ పక్కనే పడుకో

బెట్టుకోవడం ఇవన్నీ మరీ ఎక్కువయ్యాయి నీకు.ఇప్పుడు ఇంకా ఎక్కువగా ఏవేవో మాట్లాడుతు న్నావు.నా మాట విను.ఆ బొమ్మ అవతల పడేసి అమ్మతో కలిసి ఇండియావెళ్ళు.అక్కడ బోలె డంత మంది కొత్తఫ్రెండ్స్ అవుతారు.చక్కగా ఎంజాయ్ చేసిరా'

'డాడ్.డోన్ట్ సే లైక్ దట్.హీ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్ ఎవర్,ఎవర్.డోంట్ సే హీ ఈజ్ ఎ టాయ్.హీ ఈజ్ నాట్. హీ ఈజ్ యాన్ ఆర్ఫన్.ఐ వాంట్ టు టేక్ కేర్ ఆఫ్ హిమ్.హీ ఈజ్ జస్ట్ లైక్ మీ ఇన్ దిస్ హౌస్.హీ ఈజ్ మై లిటిల్‌బ్రదర్,మై లిటిల్ ఫ్రెండ్.ఎవ్విరిథింగ్ ఫర్ మీ'కళ్లల్లో నీళ్లు గిర్రున తిరుగుతుం డగా తన హేరీని అంటున్న మాటల్ని తననే అంటున్నట్టుగా బాధపడిపోతూ చటుక్కున లేచి వెళ్లిపోబో యాడు టింకూ.

'లుక్ టింకూ.నువ్వు ఇక్కడకు వచ్చి అయిదేళ్లయింది.ఇండి యాలో నీకు అమ్మమ్మ,తాతయ్య,నానమ్మ,పిన్నీ,బోలెడంత మంది అక్కలు,అన్నలు వున్నారు.హైదరాబా ద్‌లో సమ్మర్ బ్రహ్మాండంగా ఎంజాయ్ చేయచ్చు.యూ నో.ఇప్పుడు హైదరా బాద్ కంప్లీట్లీ చేంజ్‌డ్.నువ్వు ఇక్కడ చూస్తున్న హారీపోటర్,ష్రెక్ టు,స్పైడర్ మాన్-2 అవన్నీ అక్కడ కూడా చూడొచ్చు. అక్కడ మనింట్లో కంప్యూటర్ వుంది. నీకిష్టమైన వీడియో గేమ్స్ ఆడుకోవచ్చు. చక్కగా నాతో రోజూ ఆన్‌లైన్‌లో చాట్ చేయొచ్చు'.

'ఇట్స్ నాట్ ది క్వెశ్చన్ ఆఫ్ మీ డాడ్. యు ఆర్ వర్రీయింగ్ ఎబౌట్ మీ. బట్ ఐయామ్ మోర్ వర్రీ యింగ్ ఎబౌట్ హేరీ.జస్ట్ థింక్ ఎబౌట్ హిమ్.హి నెవర్ హేడ్ ఎ ఫ్లైట్ జర్నీ.హేరీకి విమానం అంటే చాలా భయమట.గాలిలోకి ఎగురుతుంటే ఊపిరి ఆడన ట్టుగా, ప్రాణం పోయినట్టుగా ఏంటేంటోగా వుంటుందట.అక్కడ నుండి విమానం కిందపడిపోతుం దేమో అని భయమేస్తోందట.చాలా ఏడుస్తున్నాడు డాడ్.ప్లీజ్ డాడ్.మేం ఇండి యాకి వెళ్లం.ఇక్కడే వుంటాం.మమ్మీ నువ్వు కూడా ఇండియా వెళ్ల వద్దు.ఇక్కడే వుండు.'అన్నాడు టింకూ, ఆ గొంతులో హేరీ పట్ల ప్రేమ,ఆందోళన స్పష్టంగా వినిపిస్తుం డగా.

'చూడు.ఫూలిష్‌గా బిహేవ్ చేసి నాకు కోపం తెప్పించకు. ఐ డోంట్ వాంట్ టు హియర్ ఆల్ దిస్ నాన్సెన్స్.జస్ట్ లిజన్ టు మీ.గెట్ రెడీ ఫర్ యువర్ ట్రిప్.ఇంక నాకు ఎక్స్క్యూ జెస్ చెప్పద్దు. నేను వినను'తేల్చి చెప్పేశాడు ఆనంద్.

★★★

ఇండియా వెళ్లటానికి ఇంకో రెండురోజులే వుంది. టింకూ మాత్రం బట్టలు సర్దుకో లేదు. ఇక చెప్పి లాభం లేదని సుస్మితనే టింకూ లగేజీ అంతా సర్దేసింది. టింకూకు ఇష్టమైన బుక్స్, పోకే మాన్ ట్రేడింగ్ గేమ్, స్విమ్‌ట్రాక్,సాకర్ షూస్, పజిల్స్ అన్నీ జాగ్రత్తగా మరిచిపోకుండా సర్దిపెట్టింది. గత రెండు రోజులుగా టింకూకి హైఫీవర్.ఒకరోజు టైల్‌నాల్ వేసి చూసింది సుస్మిత.టెంపరేచర్ తగ్గ

ముఖం పట్టలేదు.టింకూ మంచం మీద బల్లిలా కరుచుకొని పడుకుని వుంటే భయ
మేసి డాక్టర్ దగ్గర ఎపాయింట్‌మెంట్ తీసుకున్నారు.
ఆనంద్,సుస్మిత,హేరీని తీసుకొని టింకూ అందరూ కార్లో డాక్టర్‌దగ్గరకు బయల్దేరారు.
కారు వెనకసీట్లో కూర్చున్నాడు టింకూ. రెండురోజుల జ్వరానికే సగం తగ్గిపోయాడు టింకూ. అంత బల
హీనంగా వున్నా లేని ఓపిక తెచ్చుకుని మరీ హేరీతో మాట్లాడుతూనే వున్నాడు.
హేరీతో టింకూ మాట్లాడడం మరింత విసుగు, కోపం తెప్పించినా జ్వరంగా వుందని ఇక వాదన పెట్టుకో
కుండా కారు డ్రైవ్ చేస్తూ సుస్మితతో మాట్లాడటం మొదలెట్టాడు ఆనంద్.
'అసలు దీనికంతటికీ నువ్వే కారణం.అచ్చం పిల్లాడిలా వున్న బొమ్మ కొనిపె
ట్టావు వాడికి.వాడేమో దానికి హేరీ పేరు పెట్టుకుని అది అచ్చు నిజం పిల్లాడిలా వూహించుకో
వడం,దానితో మాట్లాడడం,దానికి స్నానం చేయించడం,అన్నం తినిపించటం,స్కూలుకు తీసుకె
ళ్లటం.ఏమిటిదంతా?మనూళ్లో ఇదంతా చూస్తే పిల్లాడికేమైనా పిచ్చేమో అనుకుం
టారు.నువ్వు వాడిని మొదట్లోనే ఇదంతా చేయనివ్వకుండా ఆ బొమ్మ తీసి పడేయా
ల్సింది'అన్నాడు ఆనంద్ తప్పంతా సుస్మిత మీద తోసేస్తూ.

'బావుంది.నేనేమైనా కలగన్నానా?వాడు ఇలా బిహేవ్ చేస్తాడని.బొమ్మ బావుంది.సేల్ లో దొరి
కింది.సరే వాడు గొడవ చేస్తుంటే డబ్బు తక్కువే కదా అని కొన్నాను.వాడేమో దానికి హేరీ పేరు పెట్టి అ
ది తన ఫ్రెండ్ పాల్ అంటూ వెంటతిప్పుకుంటు
న్నాడు.మధ్యలో నేనేం చేసేది?ఎంత మంది ఫ్రెండ్స్ వున్నా వాళ్లతో ఓ అరగంట ఆడిన
ప్పుడు కూడా హేరీని కూడాతీసు
కుని వెళ్లటం,వాళ్లంతా కూడా హేరీని తోటి ఫ్రెండ్‌లా చూడటం.ఏదోలా చిన్నతనం అనుకు
న్నాను కానీ వీడిలా పెంకిఘటం అవుతాడని నేననుకున్నానా?అయినా అన్నీ నన్ను అనక
పోతే మీరేం చేస్తున్నారు?మీరుమాన్పించివుండచ్చుగా'అంది సుస్మిత నెపాన్ని మళ్లీ భర్తమీదకే నెడుతూ.
'సర్లే.మనిద్దరి తగువు కాదు.డాక్టరు చెక్ చేయగానే వాడ్ని నువ్వు తీసుకుని కారిడార్‌లోకి వెళ్లు.నేను డాక్ట
రుతో మాట్లాడతానుఈ విషయం.వీడేమైనా లోన్లీగా ఫీలవుతున్నాడేమో?లేకపోతే బొమ్మతో మాట్లా
డటం,దానితో ఆడుకోవడం,దానితోనేపడుకోవడం?పైగా అదేదో మనిషి లాగావాడికి ఫ్లైట్ జర్నీపడ
దని,ఇండియా వాడికి నచ్చదని...ఏమిటిదంతా?'

★★★★

డాక్టర్ టింకూని చెకప్ చేశాక సుస్మిత, టింకూ కారిడార్ లోకి వెళ్లారు.అసలు సమస్య డాక్టరు
ముందు బైటపెట్టాడు ఆనంద్.హేరీతో టింకూ ప్రవర్తన గురించి,తన లోపలి భయాల గురించి విడమ

రిచి చెప్పాడు.
అన్నీ విన్నాడు డాక్టరు సావధానంగా.

'లుక్ మిస్టర్ ఆనంద్.పిల్లల్లో ఇదంతా మామూలే. మనకు ఇదంతా ట్రాష్ లాగా అనిపిస్తుంది కానీ అమెరికాలో సగానికి పైగా పిల్లలకు ఈ ఇమాజినరీ ఫ్రెండ్స్‌వుంటారు.వాళ్ల మానసిక ప్రపంచంలో అదంతా ఒక భాగం.వాళ్లు లోన్లీగా ఫీలవుతున్నారని, ఫ్యామిలీలో సరైన ప్రేమ, ఆప్యాయతలు పొందలేక ఇలాంటి ఇమాజినరీఫ్రెండ్స్‌ని ఏర్పరుచుకుంటారని అనుకోవడం మీ అవగాహనారాహిత్యమే.ఈ విషయంలో మీకున్నది తల్లితండ్రులుగా కేవలం ఆందోళన మాత్రమే.కానీ సైంటిస్టులకు ఇదొక రీసెర్చి.ఇలాంటి ఇమాజినరీ ఫ్రెండ్స్ వున్న పిల్లల మీద ఇప్పటివరకూ అనేక పరిశోధనలు జరిగాయి. జరుగుతున్నాయి కూడా.వాటన్నింటి సారాంశం ఒక్కటే.ఇమాజినరీ ఫ్రెండ్‌షిప్ అనేది లోపమో,అసహజమో కాదు.అందులో చాలా వాస్తవికతే కాకుండా అనేక పాజిటివ్ అంశాలున్నాయి.ఇలాంటి పిల్లలు మంచి స్నేహశీలురు.వీరిలో సృజనాత్మక శక్తి చాలా ఎక్కువ.మిగతా పిల్లలను బాగా అర్థం చేసుకుని వారితో స్నేహభావంతో మెలగటంలోనూ, ఎదుటివాళ్ల ఇష్టాఇష్టాల్ని గౌరవించడం మొదలైన విషయాల్లో ఇలాంటి పిల్లలు మీరనుకుంటున్న నార్మల్ పిల్లల కంటే చాలా ముందంజలో వున్నారు.మీరు మీ ప్రపంచం నుండి వాళ్లను చూడడం కాకుండా వాళ్ల ఊహాప్రపంచంలోకి వెళ్లి చూడండి. అప్పుడు మీ పిల్లాడు మీకు బాగా అర్థమవుతాడు.హేరీ గురించి టింకూ వ్యక్తం చేస్తున్న భయాల్ని మీరు ఏదో తేలికగా కొట్టిపారేయకుండా సహనంతో వినండి.హేరీకి ఫ్లైట్ జర్నీ అంటే వున్న అనవసర భయాల్ని,ఆందోళనల్ని తొలగించేలా నచ్చచెప్పండి. ఇండియాలో హేరీకి ఏ ఇబ్బంది కలగకుండా వుండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పండి.నా అంచనా ప్రకారం ఇండియా ట్రిప్ గురించి టింకూ ఎక్కువ ఆలోచించి ఈ జ్వరం తెచ్చుకున్నట్టున్నాడు.మీరు తన ఫ్రెండ్ గురించి సానుభూతితో మాట్లాడితే తను హేరీతో కలిసి ఈ ట్రిప్ కు మానసికంగా సిద్ధమవుతాడు.దెన్ యు డోంట్ ఫైండ్ ఎనీ ప్రాబ్లమ్ విత్ హిమ్.హీ ఈజ్ సచ్ ఎ నైస్‌బాయ్. మానసికంగా ఏవో సమస్యలున్నపిల్లలే ఇమాజినరీ ఫ్రెండ్‌షిప్స్ చేస్తారన్న మీ అపోహను తొలగించుకోండి.బెస్టాఫ్ లక్'అంటూ ఆనంద్ భుజం తట్టాడు డాక్టరు.

చెకప్ రూమ్ నుండి బైటకురాగానే ఫ్రంట్ డెస్క్‌లో కూర్చున్న రిసెప్షనిస్టు ఆనంద్‌కి చెకౌట్ సమ్మరీ షీట్‌తో పాటు టింకూకి గెట్ వెల్ సూన్ అనే అక్షరాలు,ఓ టెడ్డీ బేర్ బొమ్మ వున్న స్టిక్కర్ ఇచ్చింది.
'కెన్ యూ గివ్ వన్ మోర్ స్టిక్కర్ టు హిజ్ ఫ్రెండ్ హేరీ ఆల్సో,ప్లీజ్ ' అడిగాడు ఆనంద్.

ష్యూర్ అంటూ రిసెప్షనిస్టు మరో స్టిక్కర్ హేరీ చేతిలో పెట్టింది.
టింకూ కళ్లల్లో కోటి దీపాల కాంతులు.
ఆనంద్ వంగి టింకూని ప్రేమగా దగ్గరకు తీసుకోగానే బుగ్గ మీద ముద్దు పెడుతూ 'థాంక్‌యూ,థాంక్ యూడాడ్'అన్నాడు టింకూ.

★★★

ం